

వనస్థలిపురం సుష్మా చౌరస్తాలో రోడ్డు విస్తరణ పనుల కారణంగా అధ్వానంగా ఉన్న విజయవాడ జాతీయ రహదారి



వనస్థలిపురం నుంచి రైతుబజార్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు



దిల్‌సుఖ్‌నగర్‌లో చైతన్యపురి నాలా సమీపంలో అధ్వానంగా ప్రధాన రహదారి



వనస్థలిపురం గురుద్వార్ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు

ఎల్బీనగర్.. గుంతల రోడ్లతో ఫికర్

జోన్ బృందం : జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ జాతీయ రహదారి సుష్మా చౌరస్తా వద్ద రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తవ్వి వదిలేసిన రోడ్డుపై మట్టి చేరడంతో వాహనదారులు దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నారు. వనస్థలిపురం నుంచి రైతుబజార్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలతో కూడా వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు.



గుంతలమయంగా మారిన నాగోల్-బండ్లగూడ రోడ్డు



అల్మాస్‌గూడలోని కోమటికుంట చెరువును సందర్శించిన సబితారెడ్డి

గుర్రపుడెక్కను తొలగించాలి : సబిత

సరూర్‌నగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): చెరువుల్లో పేరుకుపోతున్న గుర్రపు డెక్కను తొలగించాల్సిన నైతిక బాధ్యత హెచ్ఎండీయే అధికారులపై ఉన్నదని, దీని కోసం ఇతర ఉన్నతాధికారుల అనుమతి ఎంత మాత్రం అవసరం లేదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి స్పష్టం చేశారు. వారి అనుమతి, వీరి అనుమతి అంటూ కాలయాపన చేయకుండా హెచ్ఎండీయే అధికారులు బేషరతుగా గుర్రపు డెక్కను తొలగించాలని ఆమె సూచించారు. సోమవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడలోని కోమటికుంట చెరువును సందర్శించి గతంలో చేపట్టిన సుందరీకరణ పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సంరెడ్డి స్వప్నా వెంకట్‌రెడ్డి, రామిడి కవితారాంరెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు రాంరెడ్డి పాల్గొన్నారు.



పెయింటింగ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

అండర్‌పాస్, ఫ్లైఓవర్ బ్రిడ్జిలను తీర్చిదిద్దుతాం

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్ బ్రిడ్జిలను అందంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్బీనగర్ రింగురోడ్డులోని అండర్‌పాస్ బ్రిడ్జి గోడలకు ఇరువైపుల అందరినీ ఆకట్టుకునేలా వేస్తున్న చిత్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని రోడ్లు శుభ్రంగా ఉంచడంతో పాటు బ్రిడ్జిలను రంగులతో అందంగా తీర్చిదిద్దితామని, త్వరలో చింతల్‌కుంట అండర్‌పాస్ పక్కన, నాగోల్ బ్రిడ్జికి కూడా పెయింటింగ్ పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్ట రాజశేఖర్‌రెడ్డి, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ మాజీ ధర్మకర్త మధుసాగర్, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సదర్ వేడుకలు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులు ఐక్యమత్యంగా ఉండాలని సూచించారు. ఈసందర్భంగా దున్నపోతులతో యాదవ యువకులు విన్యాసాలు చేయించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, క్యామ మల్లేష్, ఈశ్వరమ్మయాదవ్ పాల్గొన్నారు.

ప్రగతినగర్ పార్కు స్థలాన్ని కాపాడండి

మన్సూరాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కబ్జాకు గురవుతున్న మన్సూరాబాద్ డివిజన్ ప్రగతినగర్‌కాలనీలోని పార్క్ స్థలాన్ని కాపాడాలని హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్యను కార్పొరేటర్, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. ఈ మేరకు హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రగతినగర్ కాలనీవాసులతో కలిసి డీసీకి సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు. కాలనీవాసులు విద్యాసాగర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి, వెంకటేశ్వరరావు, సైదిరెడ్డి, సతీష్ ఉన్నారు.

కౌండిన్య ఫ్రెండ్స్ అసోసియేషన్ 'వనభోజనాలు'

మన్సూరాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంను పురస్కరించుకుని కౌండిన్య ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హరిణివనస్థలి(డీర్ పార్క్)లో సోమవారం కార్తీక మాస వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముద్దగోని రామ్మోహన్‌గౌడ్‌లతో పాటు అఖిలభారత గౌడ సంఘం జాతీయ అధ్యక్షుడు పేరం శివనాగేశ్వరరావుగౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు, గౌడ సంఘాల జేఏసీ కో-చైర్మన్ కూరెళ్ల వేములయ్యగౌడ్ విచ్చేసి కార్తీక వనభోజనాల ప్రత్యేకలను గురించి ప్రసంగించారు. కౌండిన్య ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని సురేష్‌బాబు గౌడ్, వీరమళ్ల రాంనర్సింహగౌడ్, అంబటి శ్రీనివాస్‌గౌడ్, కందికంటి శ్రీధర్‌గౌడ్, గౌడ సంఘాల నాయకులు రామ్మోహన్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా మైనారిటీ డే వేడుకలు

చంపాపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ నందనవనం హనుమాన్‌నగర్‌కాలనీలోని తెలంగాణ మైనారిటీ గురుకుల కళాశాలలో సోమవారం మైనారిటీ డే(అబుల్ కలాం ఆజాద్) వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, భారతరత్న అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, కోఆర్డినేటర్ వినోద్‌కుమార్, అధ్యాపకులు దిలీప్‌రెడ్డి, డేనియల్, కృష్ణవేణి, బాలసాహెబ్, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులు సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలి

ఓల్డ్‌మలక్‌పేట, నవంబర్ 11(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపడుతున్న సర్వేను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని వికలాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ శైలజ కోరారు. సోమవారం మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ సర్వే డాటా ఎంట్రీ ఫారంలో 13వ కాలంలో వికలాంగుల వివరాల కోసం కేటాయించడం జరిగిందని ఈ కాలంలో ప్రతి ఒక్క వికలాంగులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు పనులు ప్రారంభం

సైదాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో నూతన రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం డివిజన్ పరిధిలోని గాంధీనగర్, అస్మాన్‌ఘడ్‌లలో నూతన రోడ్లను ఆమె ప్రారంభించారు. వర్షాల కారణంగా పాడైన రోడ్లను యుద్ధ ప్రాతిపదికన వేసేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్న, రాజారాం, దిలీప్, రవి, సుభాష్, నానీ, శ్రీరాం పాల్గొన్నారు.

నూతన న్యాయ చట్టాలతో సమర్థవంతమైన న్యాయం

● జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా

సైదాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నూతన న్యాయ చట్టాలు వేగవంతమైన, సమర్థవంతమైన న్యాయాన్ని అందించడానికి ఉద్దేశించబడ్డాయని తెలంగాణ జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రా అభిప్రాయ పడ్డారు. చంచల్‌గూడలోని సీకా కార్యాలయంలో జైళ్ల సంబంధిత విషయాలపై కొత్త క్రిమినల్ చట్టాలకు సంబంధించి జైలు అధికారుల సున్నితత్వం(సెన్సిటైజేషన్)-2023 అనే అంశంపై మూడు రోజుల శిక్షణ తరగతులను సోమవారం డీజీ ప్రారంభించారు. ఈ తరగతులకు ఉత్తరప్రదేశ్, తెలంగాణ, ఏపీ, మధ్యప్రదేశ్, కర్ణాటక, మేఘాలయ రాష్ట్రాల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీ తరగతులకు హాజరైన అధికారుల నుంచి ఆయా రాష్ట్రాలలో అమలవుతున్న విధానాల గురించి అడిగి తెలుసుకున్నారు. నూతన చట్టాలపై జైలు అధికారులు, సిబ్బందికి అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు విడతల వారీగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కొత్త చట్టాలపై అవగాహన ద్వారా ఖైదీల హక్కులను నిర్ధారించడంపై జైలు అధికారులకు ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజీలు వై. రాజేష్, డాక్టర్ ఎన్. మురళీబాబు, డీఐజీలు డాక్టర్ డి. శ్రీనివాస్, ఎం. సంపత్ పాల్గొన్నారు.



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న పారిజాతారెడ్డి

అభివృద్ధి పనులు ప్రారంభం

సరూర్‌నగర్ : బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ 31వ డివిజన్‌లో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు, అల్మాస్‌గూడ 3వ, 26వ డివిజన్లలో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం పనులకు సోమవారం మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్లు రామిడి మాధురీ వీరకర్ణారెడ్డి, రామిడి కవితారాంరెడ్డి, కాలనీల ప్రతినిధులు కొండా శ్రావణ్‌కుమార్ యాదవ్, శ్రీశైలం, ధర్మేంద్రకుమార్‌శర్మ, శ్రీనివాస్, మల్లేశ్, గంగన్న పాల్గొన్నారు.

విప్లవ విద్యార్థి అమరుల ఆశయాలను కొనసాగిద్దాం

చాదర్‌ఘాట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ ఆవిర్భవించి 50ఏళ్లు పూర్తయినప్పటికీ ఈ 50 ఏళ్ల ఉద్యమంలో సమసమాజ స్థాపనకు, శాస్త్రీయ విద్యా సాధనకై జరిగిన పోరాటంలో తమ రక్తాన్ని చిందించి అమరులైన వారి ఆశయాలను కొనసాగించేందుకు విద్యార్థి లోకం ముందుండాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు పిలుపునిచ్చారు. సోమవారం పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లోని ఐడీయల్ మహిళ డిగ్రీ కళాశాలలో జరిగిన పీడీఎస్‌యూ విప్లవ విద్యార్థి అమరవీరుల వర్ధంతి సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. పీడీఎస్‌యూ గ్రేటర్ అధ్యక్షుడు మంద నవీన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, రాజు, శ్రీజ, పూజ పాల్గొన్నారు.

మైనర్‌ను పెళ్లి చేసుకున్న నిందితుడికి యావజ్జీవ శిక్ష



నిందితుడు రాజేష్

రంగారెడ్డి కోర్టులు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికను ప్రేమ పేరుతో మభ్యపెట్టి అపహరించి పెళ్లి చేసుకొని లైంగిక దాడికి పాల్పడ్డ నిందితుడికి న్యాయస్థానం జీవిత ఖైదు విధిస్తూ తీర్పును వెలువరించింది. ఏపీ శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన కనకాల రాజేష్(26) ఎల్బీనగర్‌లో ఉంటూ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఇంటర్ చదువుతున్న బాలికకు ప్రేమపేరుతో మాయమాటలు చెప్పి అపహరించుకొని వెళ్లి పెళ్లి చేసుకొని బలవంతంగా లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎల్బీనగర్ పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన పోక్సోకోర్టు న్యాయమూర్తి నిందితుడు కనకాల రాజేష్‌కు జీవిత ఖైదుతోపాటు రూ. 10వేల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు.

ఆయుర్వేద ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

సైదాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ చౌరస్తాలోని మాణిక్ ప్రభు ఆయుర్వేద ఆస్పత్రిలో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఆస్పత్రి సెల్లార్‌లో ఉన్న ఆయుర్వేద మందుల తయారీ గోదాంలో నుంచి దట్టమైన పొగలు వ్యాపించాయి. కెమికల్ వాసన పొగలతో పరిసర ప్రాంతాల వాసులు అవస్థలు పడ్డారు. స్థానికులు మలక్‌పేట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో కేవలం ఆస్తి నష్టం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

సగర సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

సరూర్‌నగర్: సగర సంఘం రంగారెడ్డి జిల్లా కార్యవర్గాన్ని సోమవారం అల్మాస్‌గూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సంఘం జిల్లా సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు నూతన ప్రతినిధులతో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్‌సగర ప్రమాణ స్వీకారం చేయించారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా మర్క సతీశ్‌సగర, ప్రధాన కార్యదర్శిగా చిలుక శ్రీకాంత్ సగర, కోశాధికారిగా నగరాల నారాయణసగర ఎన్నికయ్యారు. సంఘం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా చింతల రవిసగర, ప్రధాన కార్యదర్శిగా సాయికుమార్‌సగరలను ఎన్నుకున్నట్లు శేఖర్ తెలిపారు. సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు హరికిషన్‌సగర, ప్రధాన కార్యదర్శి గౌరక్కసగర, కోశాధికారి కుమారస్వామిసగర, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సురేశ్‌సగర, ప్రధాన కార్యదర్శి మహేందర్‌సగర, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు స్రవంతిసగర, కోశాధికారి జయమ్మసగర పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి : మధుసూదన్‌రెడ్డి



పండ్లను పరిశీలిస్తున్న చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): బాటసింగారం పండ్ల మార్కెట్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటామని గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మార్కెట్‌లో జరుగుతున్న అమ్మకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్లనే పండ్ల వ్యాపారం రోడ్డున పడిందన్నారు. వ్యాపారాలు సరిగా లేక పలువురు వ్యాపారులు రోడ్డున పడ్డారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కోహెడ మార్కెట్ నిర్మాణానికి తగిన ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే మామిడి సీజన్‌లో రైతులకు ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ భాస్కరాచారి, డైరెక్టర్లు జైపాల్ రెడ్డి అంజయ్య, లక్ష్మి, మచ్చేందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, గణేష్ నాయక్, నర్సింహ, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేష్‌గుప్తా, ఇబ్రహీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : శ్రీనివాస్‌గుప్తా



పరీక్షలు చేయించుకుంటున్న శ్రీనివాస్‌గుప్తా

ఎల్‌బీనగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా సూచించారు. పవిత్ర కార్తీక సోమవారం సందర్భంగా ఆర్‌కేపురం టెలిఫోన్‌కాలనీలోని శ్రీశైవ క్షేత్ర పీఠం తెలంగాణ ఆధ్వర్యంలో శివ పూజతో పాటు నిర్వహించిన వైద్యశిబిరం, కంటి పరీక్ష శిబిరం, దంతపరీక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. శ్రీశైవ క్షేత్ర పీఠాధిపతులు శివ స్వామిజీ జయంతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పంచభూత లింగాలకు అభిషేకం, ఆయుష్ హోమం నిర్వహించారు. అనంతరం శివస్వామిజీ భక్తులకు అనుగ్రహభాషనం చేశారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు రక్తదాన, వైద్యశిబిరాలు, 216 ఆలయాలలో అమ్మవార్లకు ఒడిబియ్యం సమర్పణ వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు శ్రీశైవ క్షేత్రం కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎల్‌వీకుమార్, వాసవీ ఇంటర్నేషనల్ పరివార్ అధ్యక్షుడు జగిని శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. కార్యక్రమంలో శ్రీశైవ క్షేత్రం నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ అయిత హైమ, మేనేజర్ కోటేశ్వర్‌రావు, వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ శ్రీనివాసచారి, తక్షణ గవర్నర్ చక్రపాణి, కాశెట్టి నగేష్, సాంబమూర్తి, గోపాల్, సత్యలక్ష్మి, రేణుక, నాగలక్ష్మి, శ్రీనివాస్‌రావు, రమణయ్య, ఉదయ్, నాంపల్లి శ్రీనివాస్, చొల్లేటి ఆనంద్, అంజయ్య, శ్యాంసుందర్ గౌడ్, నాగమళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం కోసమే ఇంటింటా సర్వే : షేక్ అక్బర్



షేక్ అక్బర్

ఓల్డ్‌మలక్‌పేట, నవంబర్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసమే ఇంటింటా కులగణన సర్వే చేపడుతుందని కాంగ్రెస్ మలక్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ అక్బర్ అన్నారు. సోమవారం ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న కులగణన సర్వేకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. దేశంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రం కులగణన చేయలేదని రాష్ట్రం దేశంలోనే మోడల్‌గా నిలవబోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడుగుబలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ వారి అభ్యున్నతికి కృషిచేస్తుందన్నారు. మూసీ పునరుజ్జీవ కార్యక్రమం ఒక చారిత్రాత్మకమైన ఘట్టమని దీంతో హైదరాబాద్ నగర రూపురేకలు మారుతాయన్నారు. మూసీ పునరుజ్జీవ ప్రక్రియ భవిష్యత్తు తరాలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. మూసీ వెంట ఇళ్లు కోల్పోతున్న వారిని ప్రభుత్వం అన్నివిధాల ఆదుకుంటుందని ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. మూసీ వెంట నివసిస్తున్న ప్రజలు స్వచ్ఛందంగా ఇళ్లు ఖాళీ చేసి సంతోషంగా ప్రభుత్వం ఇచ్చిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు వెళ్తున్నారన్నారు. దీనిని ప్రతిపక్ష పార్టీ నాయకులు రాజకీయం చేస్తూ వారి స్వార్థం, ఉనికి కోసం ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యవరిస్తున్నారని ఆయన ఆరోపించారు. కులగణన సర్వేను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రజలను కోరారు.

ఆలయాల్లో చోరీలకు పాల్పడిన
ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

● ఒక బైకు, 3 సెల్‌ఫోన్లు, రూ.40 వేలు స్వాధీనం

కొత్తపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో చోరీలకు పాల్పడిన ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను ఎల్బీనగర్ డిటెక్టివ్ పోలీసులు అరెస్టు చేసి ఒక బైకు, 3 సెల్‌ఫోన్లు, రూ .40వేలు స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించారు. ఎస్‌హెచ్ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జల్సాలకు, విలాసాలకూ బానిసలైన ముగ్గురు కర్నాటక యువకులు దొంగలుగా మారారు. కర్నాటక గుల్బర్గ జిల్లా చించొలి, చిమ్మెడ్‌లై గ్రామానికి చెందిన ఉమేష్(23), కార్తీక్(20), నితిన్‌కుమార్(20) స్నేహితులు. ఉమేష్, కార్తీక్‌లు ఇంటర్ విద్య మధ్యలోనే వదిలేశారు. నితిన్‌కుమార్ ఐటీఐ పూర్తి చేశాడు. ముగ్గురూ ఆ గ్రామంలోనే చిన్న ఉద్యోగాలు చేస్తూ జీవించేవారు. మద్యానికి, విలాసవంత జీవనానికి బానిసలై కొన్ని నెలల క్రితం పక్కరాష్ట్రాల్లో దొంగతనాలు చేసి సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఆలయాల్లో హుండీల్లో డబ్బు దోచుకోవాలని పథకం వేసుకున్నారు. బైకుపై ముగ్గురూ దొంగతనానికి ముందు రోజు నగర శివారు హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, ఎల్‌బీనగర్ తదితర ప్రాంతాలకు చేరుకుని ఓ లాడ్జీలో ఉంటారు.

దగ్గరలోని ఆలయాల వద్ద రెక్కీ

స్మార్ట్‌ఫోన్లలో గూగుల్ సర్చ్ చేస్తూ దగ్గరలో ఆలయాల సమాచారం సేకరిస్తారు. సాయం వేళ దగ్గరలోని ఆలయాల వద్ద రెక్కీ చేస్తారు. సెక్యూరిటీ, సీసీ కెమెరాలు, హుండీ ఎక్కడ ఉంది తదితర అంశాలను పరిశీలిస్తారు. సులభంగా హుండీ ఎత్తుకెళ్లే అవకాశం ఉండే ఆలయాల్లో అదే రోజు అర్ధరాత్రి పథకం ప్రకారం సదరు ఆలయంలో దొంగతనం చేసి మరుసటి రోజు ఉదయం బైకుపై కర్నాటకకు వెళ్లి పోతారు. గత నెల 12న అర్ధరాత్రి వారు అబ్దుల్లాపూర్‌మెట్‌లోని హనుమాన్ ఆలయంలో హుండీ చోరీ యత్నం చేశారు. హుండీలో డబ్బు లేకపోవడంతో అదే రోజు హయత్‌నగర్ పీఎస్ పరిధి తొర్రూరు చౌరస్తాలో గల సాయిబాబా ఆలయంలోని హుండీలోని డబ్బు దోచుకుని వెళ్లారు. అదేవిధంగా ఈ నెల 25న అర్ధరాత్రి వారు ఎల్బీనగర్ పీఎస్ పరిధిలోని మన్సూరాబాద్ సెంట్రల్ బ్యాంకు కాలనీలో గల శ్రీఉమానాగలింగేశ్వరాలయంలో హుండీలోని డబ్బు దోచుకుని వెళ్లారు. సోమవారం ఉదయం ఎల్‌బీనగర్ పోలీసులు సిరీస్ రోడ్డులో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ ముగ్గురు దొంగలూ బైకుపై వెళ్తూ పోలీసులను చూసి బైకు వదిలేసి పరారయ్యేందుకు యత్నించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఉమేష్‌పై కర్నాటకలో ఒక చోరీ కేసు నమోదయినట్లు తెలిసింది. విచారణలో నేరాలను అంగీకరించడంతో వారి బైకును, 3 సెల్‌ఫోన్లను, రూ.40 వేలనూ, ఓ ఇనుప రాడ్డునూ స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించారు.



ఆర్‌జేడీకి వినతిపత్రం అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

గుర్తింపు లేని కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఎల్‌బీనగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కొత్తపేట అష్టలక్ష్మీ ఆలయం ఆర్చి పక్కనున్న ఒకే భవనంలో గుర్తింపు లేకుండా అక్రమంగా నడుస్తున్న కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రొటెక్షన్ ఫర్ రైట్ టూ ఇన్ఫర్మేషన్ యాక్ట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి, కమిషనర్, ఇంటర్మీడియట్ బోర్డు జాయింట్ సెక్రటరీ, రంగారెడ్డి జిల్లా ఆర్‌జేడీలకు ఆయన వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా పరిధిలోని కొత్తపేట అష్టలక్ష్మీ ఆలయ ఆర్చి పక్కన ఉన్న ఒకే భవనంలో నానో కళాశాల, తపస్య కళాశాల, ఆకాశ్ కళాశాలలు అక్రమంగా నిర్వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఒకే విద్యార్థి నుంచి తపస్య, ఆకాశ్ కళాశాలలు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దీంతో విద్యార్థులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న కళాశాలలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఉచిత వైద్య శిబిరం

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ శాంతినగర్ లెప్రసీ కాలనీలో సోమవారం ఎన్‌సీడీ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 50 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దఅంబర్‌పేట్ బస్తీ దవాఖానా మెడికల్ ఆఫీసర్ రుద్రమదేవి, పీఎంఓ సులోచన, డీపీఎంవో శాంతిరాజ్, ఆశవర్కర్ వనజా, స్టాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రమేశ్, కాలనీవాసులు రమేశ్, డోమ్నిక్ రహమతుల్లా పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు

అబ్దుల్లాపూర్‌మెట్ : పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని బాచారం గ్రామంలో ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం బీఆర్ఎస్ అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్, మాజీ అధ్యక్షులు పూజారి చక్రవర్తిగౌడ్, తొర్పునూరి ధనుంజయగౌడ్, మాజీ సర్పంచ్ బొడిగె రమేష్‌గౌడ్ పరిశీలించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సీక సాయికుమార్ గౌడ్, నర్సింహచారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'సర్వే'

వనస్థలిపురం : వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లలో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతుంది. అందులో భాగంగా డివిజన్‌లలో ఏటైపు క్వాటర్స్, షాపింగ్ కాంప్లెక్స్, టీచర్స్ కాలనీ, సాహెబ్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్, హుడా సాయినగర్ కాలనీ, కమలానగర్ తదితర కాలనీల్లో ఎన్యూమరేటర్లు కుటుంబ సర్వేను చేపడుతున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసుల నుంచి ఎన్యూమరేటర్లు కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తు సర్వేను నిర్వహిస్తున్నారు. సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లకు కాలనీవాసులు పూర్తి వివరాలు తెలియజేస్తున్నారు.